ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 29.5
కనిష్ఠం 21.4

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

శుక్రవారం 15 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 587.50 (305.803) | 1,72,774 | 2,37,056 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 642.50 (3.84) | 6,612 | 10,098 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 170.011 (38.360) | 2,71,900 | 1,81,334 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.225



సూర్యాపేట మండల పరిధిలోని పాట్లపాడు మార్గంలో చెక్‌డ్యాం వద్ద పొంగిపొర్లుతున్న వరద

# వర్షంతో అతలాకుతలం

- ఆగని వరద ఉధృతి
- నిండిన చెరువులు, వాగులు
- పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం పలుచోట్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 6.62సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కాగా, అత్యధికంగా మేళ్లచెర్వు మండలంలో 12.6 సెం.మీ, ఆత్మకూర్(ఎస్)లో 11.01, పాలకీడులో 10.66, కోదాడలో 9.47 సెం.మీ వర్షం కురిసింది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో పాటు ముందు జాగ్రత్తగా పాఠశాలకు గురువారం సెలవు ప్రకటించింది. అదేవిధంగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయగా, మొత్తం 17మంది ఫోన్ చేసి సమస్యలను తెలియజేయగా అధికారులు వాటిని పరిష్కరించారు. ఇదిలా ఉండగా, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాగులు, చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఆత్మకూర్(ఎస్), మోతె, పాలకీడు, పెన్‌పహాడ్, తిరుమలగిరి, తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెంతో పాటు పలు మండలాల్లో చెరువులు అలుగులు పోస్తున్నాయి. ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ రహదారిపై నుంచి వరద ప్రవహిస్తుండగా వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. మేళ్లచెరువు మండలంలోని పలు చెరువులు అలుగులు పోస్తున్నాయి. ఆయా మార్గాల్లో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. మోతె మండలంలోని వరద తాకిడికి రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. హుజూర్‌నగర్‌లో సుమారు 5వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరి చేలను వరద ముంచెత్తింది.

(ఆంధ్రజ్యోతి, మఠంపల్లి): మఠంపల్ల మండలంలో సుమారు 1,000 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రఘునాథపాలెం, మఠంపల్లి ఎస్సీకాలనీ, చౌటపల్లి, గుర్రంబోడుతండా తదితర గ్రామాల్లో వీధులు వరదయమయ్యాయి. చెన్నాయిపాలెం వద్ద అలింగాపురం వెళ్లే రహదారిలో చెరువు గండిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యాతవాకిళ్ల, చౌటపల్లి, బక్కమంతలుగూడెం చెరువు, మఠంపల్లి మామిళ్లచెరువు, చౌటపల్లి ఊర చెరువుల కింద పంటలు దెబ్బతిన్నాయి. మఠంపల్లి-రఘునాథపాలెం మార్గంలో కప్పలవాగు ఉధృత్తంగా ప్రవహిస్తుడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నాయిపాలెం-అలింగాపురం, యాతవాకిళ్ల-హనుమంతులగూడెం, వర్ధాపురం-మంచ్యాతండా, మట్టపల్లి-హుజూర్‌నగర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఓ సిమెంట్ పరిశ్రమకు చెందిన రైల్వేట్రాక్ దెబ్బతిన్నది.

## అలుగులు పోస్తున్న చెరువులు వాగులు

(ఆంధ్రజ్యోతి, మోతె): మోతె మండలంలో మామిళ్లగూడెం-విభలాపురం మార్గంలో గండ్లచెరువు అలుగు పోస్తుండటంతో బ్రిడ్జిపైనుంచి మూడు అడుగుల మేర వరద ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచాయి. రంగాపురంతండా చెరువు కట్ట తెగింది. ఉర్లుగొండ, నర్సింహాపురం వద్ద పాలేరు వాగుకు వరద భారీగా వస్తుండగా, అన్నారిగూడెం, నర్సింహాపురం, తుమ్మగూడెం, ఉర్లుగొండ గ్రామాలకు చెందిన 200 ఎకరాల వరి వరదలో చిక్కుకుంది. మోటార్లు పాలేరు వాగులో కొట్టుకుపోయాయి. నామవరం పెద్ద చెరువు కింద మాదారం వద్ద వరద మూడు అడుగుల మేర వస్తోంది. ఇక్కడ భారీగా చేపలు ఎదురెక్కడంతో ప్రజలు తరలి వచ్చి చేపలు పట్టారు. సిరికొండ-రావిపహడ్ వెళ్లే దారిలో చెరువు అలుగు పోయగా, తహసీల్దార్ వెంకన్న సిబ్బందితో వచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుకు గండి కొట్టించారు. దీంతో కాశిగూడెం గ్రామానికి ప్రమాదం తప్పింది...



మోతె మండలం మామిళ్లగూడెం-విభలాపురం వద్ద వాగు నీటి ఉధృతి

- మిగతా 8వ పేజీలో...

## రైతన్న ఆగమాగం

(ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు ఆగమాగమయ్యారు. సుమారు 5వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. పట్టణంలోని ముత్యాలమ్మ చెరువుకు అనుసంధానంగా ఉన్న అలుగు భారీ పొంగి పొర్లి దీనికి అనుసంధానంగా ఉన్న కాల్వకట్ట తెగడంతో గోవిందాపురం, మఠంపల్లి రోడ్డు పరిధిలో వరి చేలల్లో ఇసుక మేటలు వేసింది. మట్టపల్లి రోడ్డులో, లక్కవరం, లింగగిరి ప్రాంతాల్లోని పంట పొలాలు వరదకు కొట్టుకుపోయాయి. బట్టవానికుంట ఉధృతికి పొలాలు నీట మునిగాయి. ఈ చెరువు తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలమ్మ చెరువు పొంగి ప్రవహించడంతో సుమారు 1,000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఈదుల గండి వాగు పొంగి ప్రవహించడంతో హుజూర్‌నగర్, లక్కవరం పరిధిలో 1,500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బూరుగడ్డ నల్లచెరువు, వేములూరు వాగు బంధం ఉధృతంగా ప్రవహించడంతో గోపాలపురం, కాలువపల్లి, రాయినిగూడెం, లింగగిరి, సీతారాంపురం, అమరవరం శ్రీనివాసపురం ప్రాంతాల్లోని సుమారు 2వేల ఎకరాలకు పైగా పంటలు నీట మునిగాయి. రైతుల మోటార్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. వేపలసింగారం పరిధిలోని పంట పొలాలు, వేములూరు వాగు పరిధిలో 50 ఎకరాల పంట నష్టం వాటిల్లింది. శ్రీనివాసపురం-అమరం గ్రామాల మధ్య కల్వర్టు తెగిపోయింది. లక్కవరం-హుజూర్‌నగర్ మధ్య ఈదులగండి వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించింది. బూరుగడ్డ-గోపాలపురం మధ్య నల్లచెరువు అలుగు పోయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

హుజూర్‌నగర్ మండలం లక్కవరంలో పొలాల్లో ఇసుక మేటలు



# ప్రజలకు ఇబ్బందులు తలెత్తొద్దు

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎస్పీ నర్సింహ

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్, అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజలకు సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అధికారులు 24గంటలు అప్రమత్తంగా ఉన్నారన్నారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. జిల్లాలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు లేవని,నల్లగొండ జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, జిల్లా అగ్నిమాపక శాఖ సమన్వయంతో మూడు ఎస్‌ఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, ఆర్డీవో వేణుమాధవ్, డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ. సీతారామయ్య, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్

అధికారులు 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వచ్చిన 17 ఫోన్ కాల్స్‌కు స్పందించి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.

### పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

పరిశ్రమల్లో ఉద్యోగుల భద్రత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. గురువారం ప్రమాదకర పరిశ్రమలపై వివిధ భాగాల ఉన్నత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ సీతారాంనాయక్, లేబర్ డిప్యూటీ కమిషనర్ అరుణ, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ భీమారావు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

హాజరుకానున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వేడుకలకు సిద్ధమైన కలెక్టరేట్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టరేట్ ను ముస్తాబు చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 9:30గంటలకు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి ఉత్తమ్‌జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 9:31కి జాతీయ గీతాలపన, 9:33కి రాష్ట్ర గీతాలాపన ఉంటుంది. తర్వాత 9:40 గంటలకు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి గురించి ప్రసంగించనున్నారు.

# పదవీ కాలం మరో ఆరు నెలలు

పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల గడువు పెంపు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

7



# ఉపాధి దిశగా అడుగులు

- అన్ని హంగులతో హుజూర్‌నగర్‌లో ఏటీసీ సెంటర్
- దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏటీసీ అధికారులు
- వచ్చే నెలలో ప్రారంభించనున్న మంత్రి ఉత్తమ్

**నిరుద్యోగ, యువతీ, యువకులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలో రూ.6.50కోట్లతో నిర్మించిన ఏటీసీ భవనం త్వరలో ప్రారంభం కానుంది. టాటా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సుమారు రూ.30కోట్ల విలువచేసే మిషనరీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. సెప్టెంబరు మొదటి వారంలో ఏటీసీ సెంటర్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు.**

- ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్



హుజూర్‌నగర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), శిక్షణ కేంద్రంలో టాటా టెక్నాలజీస్ సంస్థ ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలు

శిక్షణ ఇచ్చేందుకు ఏటీసీ అధికారులు ఈ నెల 6 నుంచి 28వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి వివిధ కోర్సులకు 40మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫణిగిరిగట్టు వద్ద ఐటీఐ, ఏటీసీ శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేయించారు. 2014లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. ఐటీఐ, ఏటీసీ కళాశాల మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీఐ, ఏటీసీ సెంటర్లను మంజూరు చేయించారు. ఏటీసీ సెంటర్‌లో 90శాతం మౌలిక వసతులు, శిక్షణకు అవసరమైన ఆధునిక యంత్రాలు మంజూరు చేశారు.

### సెప్టెంబరు మొదటి వారంలో శిక్షణ

ఆగస్టు 28వ తేదీ వరకు అడ్మిషన్లు పూర్తిచేసి వచ్చే నెల మొదటి వారంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. సుమారు రూ.30కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక మిషనరీతో శిక్షణ ఇవ్వనున్నారు. హుజూర్‌నగర్ ఏటీసీ సెంటర్‌లో ప్రభుత్వం మొత్తం 172సీట్లు మంజూరు చేసింది. వీటిలో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్‌లో 40సీట్లు,ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో 40, ఇంజనీరింగ్ డిజైనింగ్ టెక్నిషియన్స్‌లో 20, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్‌లో 24 సీట్లు సీఎస్‌సీ మిషనింగ్‌లో 24, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లో 24సీట్లు కేటాయించారు. శిక్షణ తీసుకున్న వారికి హుజూర్‌నగర్ ప్రాంతంలో నియోజకవర్గంలోని అనేక సిమెంట్ ఫ్యాక్టరీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులు సొంతంగా స్కిల్‌డెవలప్ చేసుకునేందుకు ఏటీసీ సెంటర్ ఉపయోగపడనుంది.

**నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీఐ, ఏటీ సీ సెంటర్లను మంజూరు చేయించాను. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉపాధి పొందడమే లక్ష్యంగా ఏటీసీని ఏర్పాటు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి చూపిస్తుంది. హుజూర్‌నగర్ ప్రాంతంలోని యువతీ, యువకుల భవిష్యత్, వారి కలలను సాకారం చేసేందుకు శిక్షణ తీసుకోవాలి. బంగారు భవిష్యత్ నిర్మాణానికి శిక్షణ కేంద్రం ఎంతో మేలు చేస్తుంది.

- మంత్రి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# ఓట్ల చోరీ తీవ్రమైన నేరం

*టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్*



సూర్యాపేటలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటరూరల్ ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ అనుసరించిన ఓట్ల దొంగలింపు, మార్ఫింగ్‌ల ప్రక్రియ తీవ్రమైన నేరమని, దీనికి ఆ పార్టీ బాధ్యత వహించి శిక్ష అనుభవించాల్సిందేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తూ గురువారం సూర్యాపేటలోని ఓహోటల్‌లో కాసేపు ఆగారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడి, డిప్యూటీ స్పీకర్ రాం చంద్‌ర్‌నాయక్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు సానుకూలం గా ఉన్న వ్యక్తులకు నాలుగు, నాలుగు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. సింగిల్ బెడ్ రూం ఇంట్లో 45 ఓట్లు నమోదవడం, ఓట్ల చోరీకి నిదర్శనం అన్నారు. ఈ విషయాలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రుజువులతో సహా బయటపెట్టారన్నారు.

అధికారమే పరమావధిక మోదీ, అమిత్‌షాలు ఈ నేరానికి పాల్పడినట్లు ఆరోపించారు. ఓట్ల దొంగిలింపుపై నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు ఆరు గ్యారెంటీలను పక్కగా అమలు చేస్తోందన్నారు. సన్నబియ్యం పథకం ఒక చారిత్రత్మకమైన కార్యక్రమం అన్నారు. 10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు రేషన్‌కార్డులను ఇచ్చామని గుర్తుచేశారు. గవర్నర్ నియామకాల్లో గతంలో జరిగిన విధంగానే ఎమ్మెల్సీలను నియమించామని, సుప్రీం తీర్పు వచ్చిన తర్వాత స్పందిస్తామని తెలిపారు. పొత్తులో భాగంగా కోదండరామ్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చామని, కేసీఆర్ కంటే ఎక్కువగా తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న వ్యక్తి కోదండరామ్ అని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటే చిన్న పిల్లలు కూడా నవ్వుతారని ఎద్దేవా చేశారు. మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పెద్దిరెడ్డి రాజా, ముదిరెడ్డి రమణారెడ్డి, నాయకులు దరవత్ వెంకన్ననాయక్, వెలుగు వెంకన్న. దేవేందర్, రమేష్‌నాయుడు. బంటు చొక్కయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# లాకర్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భద్రత పరమైన చర్యల్లో లోపం ఉండవద్దని, బలమైన లాకర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ నర్సింహ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారంబ్యాంకు, బంగారం దుకాణాల భద్రత చర్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో భద్రత పటిష్టంగా పనిచేస్తుందన్నారు. నిత్యంతనిఖీలు నిర్వహించడంతో పాటు రాత్రివేళలో పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ప్రతిరోజు నైట్ అలర్టింగ్ పోలీస్ అధికారిని నియమించి జిల్లాలో భద్రత పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.బ్యాంకు వద్ద,బంగారం దుకాణాల వద్ద చుట్టూ తెలిసేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా వ్యక్తులు తాళం పగలగొడితే అలారం వచ్చేలా సిస్టమ్ ఏర్పా టు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రపన్నకుమార్, సీఐలు రాజశేఖర్,నాగేశ్వరావు,శివశంకర్, నర్సింహారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్,సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది,బ్యాంకర్లు,బంగారం దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటన

**హుజూర్‌నగర్‌లో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటుకు తుది నిర్ణయంపై చర్చలు**



హుజూర్‌నగర్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. సూర్యాపేటలో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 12 గంటల నుంచి 3 గంటల వరకు హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ యూనివర్సిటీకి సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. వ్యవసాయ యూనివర్సిటీకి సంబంధించి అనువైన భూమిని ఇప్పటికే గుర్తించగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో చర్చించి తుది నిర్ణయం అవకాశముంది.

# తిరంగా పతాకం జాతీయ ఐక్యతకు ప్రతీక

- చల్లా శ్రీలతారెడ్డి



సూర్యాపేటలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, నాయకులు

భానుపురి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరంగా పతాకం జాతీయ ఐక్యతకు ప్రతీకని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా గాంధీవిగ్రహం వరకు గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ర్యాలీలో దేశ భక్తి నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించే ప్రతి కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు ముందుండాలని పేర్కొన్నారు. విదేశీ వస్తువులు వద్దు.. స్వదేశీ వస్తువులు మాత్రమే వాడాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను పెట్టుకోవాలన్నారు. ర్యాలీలో ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పాఠశాల, కళాశాలల యజమాన్యం, విద్యార్థులు, మండల, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, ప్రభారీలు, కౌన్సిల్ సభ్యులు, వివిధ మోర్చాల నాయకులు తదితరులు హాజరయ్యారు.


# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లునాగార్జునరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపాదకన చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు అలుగులు పోస్తున్నాయని వేలాది ఎకరాల్లో పొలాలు నీట మునిగాయని తెలిపారు. నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. వర్షాల మూలంగా అనేక ఇళ్లు నేలమట్టం అయ్యాయని బాధితులకు ఇందిరమ్మ ఇల్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ముల్కలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సాగు అరుదైన గౌరవం




ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొందరు రైతులు ప్రత్యేక పంటలు సాగుచేసి గుర్తింపు పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ పంటలు సాగుచేసి లాభాలు గడిస్తున్నారు. ఆ కోవకే వస్తారు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన తెలుకుంట్ల రాంమూర్తి. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే పదెకరాల్లో సుమారు ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్షు విభాగం ఆహ్వానం మేరకు ఈ నెల 15న ఢిల్లీలో జరుగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు రాంమూర్తి-శైలజ దంపతులు ఢిల్లీ వెళ్లారు.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

- పదెకరాల్లో కలబంద సాగు చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లావాసి
- ఆర్‌సీఎఫ్‌సీ సిఫారసుతో కేంద్ర ఆయుష్షు విభాగం ప్రత్యేక ఆహ్వానం
- ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం

పాటిమట్ల గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాంమూర్తి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటారు. ఆయనకు పాటిమట్లలో తల్లిదండ్రులు సంపాదించిన వ్యవసాయ భూమి ఉంది. సాధారణ పంటలు సాగు చేస్తే తాను ఎప్పటి కప్పుడు వెళ్లి చూడలేనని(పర్యవేక్షణ చేయలేనని), ఏపంట వేస్తే బాగుంటుందని స్నేహితులతో చర్చించారు. ఓ స్నేహితుడి సలహాతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఓ రైతు సాగు చేస్తున్న కలబంద(అలోవేరా) సాగును చూసి వచ్చారు. పశువులు, కోతుల బెడద ఉండక పోవడంతో పాటు అడవి జాతి మొక్క అయినందున తెగుళ్లు సోకవని తెలుసుకొని పదెకరాల్లో ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. సాగుకు అనుకూలంగా భూమి చదును చేసి, మొక్కలు నాటడానికి ఎకరాకు సుమారు రూ.50వేలు ఖర్చు అయిందని రాంమూర్తి తెలిపారు. ఎకరాకు 5వేల నుంచి 6వేల మొక్కలు నాటుతారు. కలబంద మొక్క నాటిన నాటి నుంచి ఒక సంవత్సరానికి కోతకు వస్తుంది. ఒక్కసారి నాటిన మొక్క ఐదేళ్లు ఉంటుంది. ఐదేళ్ల తర్వాత దానిని తొలగించి మళ్లీ నాటుకోవాలి. కలబంద పంటకు డ్రిప్ ఏర్పాటు చేశారు. ఎరువులు వేయాల్సిన అవసరం పెద్దగా ఉండదు. పనులన్నీ కూలీలు, యంత్రాలతో చేయించడంతో కలబంద సాగు నిర్వహణకు ఏడాదికి ఎకరాకు సుమారు రూ.50 వేల ఖర్చు వస్తుందని ఆయన తెలిపారు. ఏడాదికి ఎకరాకు సుమారు 15టన్నుల దిగుబడి వస్తుందని, సుమారు రూ.1.60 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్షపైగా మిగులుతాయని, ఎర్రనేలలు కలబంద సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు.

### ఎస్‌ఎంపీబీ సిఫారసుతో...

కలబంద సాగుచేస్తున్న రాంమూర్తి తెలంగాణ రాష్ట్ర ఔషధ మొక్కల(మెడిసినల్‌ప్లాంట్లు) బోర్డులో నమోదై ఉన్నారు. ఎస్‌ఎంపీబీతో పాటు రీజినల్ కం ఫెసిలిటేషన్ సెంటర్(ఆర్‌సీఎఫ్‌సీ) సిఫారస్సుతో కేంద్ర ప్రభుత్వ ఆయుష్షు విభాగం రాంమూర్తి-శైలజ దంపతులను ఢిల్లీ జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానించింది. 16వ తేదీ వరకు అక్కడే ఉండడానికి కేంద్ర ప్రభుత్వం వసతి కల్పిస్తుంది.


### కలబంద పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి



కలబంద సాగు లాభదాయకంగానే ఉన్నప్పటికీ మార్కెట్ సౌకర్యం తక్కువ. ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఎక్కువగా సాగు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలబందకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. మార్కెట్ సౌకర్యం ఉంటే సాగు పెరుగుతుంది. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, గుజ్జు తీసే యంత్రం లాంటివి సబ్సిడీపై అందించాలి.

- తెలుకుంట్ల రాంమూర్తి, రైతు.

# బేగంపేట.. మీ దేశభక్తికి సలాం



బేగంపేటలో ఎగురుతున్న జాతీయ పతాకం

- గ్రామంలో 78 ఏళ్లుగా మువ్వన్నెల జెండా రెపరెపలు
- జాతీయ పతాకంపై గౌరవం.. అమితమైన ప్రేమ గ్రామస్థుల సొంతం
- జాతీయ పతాక ఆవిష్కరణ అంటే వారికి పండుగే

రాజాపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామస్థులకు జాతీయ పతాకంపై అమితమైన గౌరవం, ప్రేమ. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు 1947 ఆగస్టు అర్ధరాత్రి నుంచే ఆ గ్రామంలో జాతీయ పతాకం ఎగిరింది. అప్పటినుంచి గ్రామంలో మువ్వన్నెల జెండా నిర్విరామంగా రెపరెపలాడుతోంది. ఎనిమిది దశాబ్దాలుగా గ్రామస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. బేగంపేట గ్రామం మొదటి నుంచీ విప్లవోద్యమాలకు కేంద్రం. నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా రగుల్ జెండా ఎగురవేసిన ఘనత వారిది. బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే గ్రామానికి చెందిన బద్దం నర్సిరెడ్డి, పిట్ట రాంచంద్రారెడ్డి, చిగుర్ల మల్లయ్య, బలిజ రాజవీరయ్య కలిసి గ్రామ చావడిలో జాతీయ పతాకం ఎగురవేశారు. మూడు రంగుల జెండాను బోగ హనుమంతు తన మగ్గంపై స్వయంగా నేచి రంగులు అద్దారు. దర్జీ బొంతయ్య పతాకంపై ధర్మ చక్రాన్ని కుట్టారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26వ తేదీల్లో, దసరా పండుగ రోజు కూడా జాతీయ పతాకాన్ని మారుస్తుంటారు. జాతీయ పతాక ఆవిష్కరణను గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో పండుగలా జరుపుకుంటారు. నిరంతరాయంగా ఎగురుతున్న జాతీయ పతాకాన్ని చూసి గర్వంగా సెల్యూట్ చేస్తారు. ఆగస్టు 15వ తేదీన 79వ సారి గ్రామస్థులు సగౌరవంగా పతాకాన్ని ఎగురవేయనున్నారు.

### జాతీయ పతాకాన్ని అందరం గౌరవిస్తాం



మా గ్రామంలో జాతీయ పతాకం నిరంతరంగా ఎగురుతోంది. జాతీ పతాకాన్ని అందరం గౌరవిస్తాం. కలసికట్టుగా పండుగలా జరుపుకుంటాం. అనవాయితీగా పతాకాన్ని ఎగురవేస్తున్నాం.

- భిక్షపతి, సింగిల్‌విండో డైరెక్టర్, బేగంపేట.

### మాకు గర్వంగా ఉంది



మా గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేయడం ఎంతో గర్వంగా ఉంది, స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా ఎగురుతూనే ఉంది. ఏడాదిలో మూడుసార్లు జెండాను మారుస్తాం,

- బోగ రుషి, మాజీ సర్పంచ్, బేగంపేట.

# దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని సూరేపల్లిలో అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కేశవపట్నం రమణయ్యపై ఈ నెల 12వ తేదీన భూ తగాదాల విషయంలో దాడి జరిగింది. భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండాకుచెందిన గుగులోతు నర్సింహ సూరేపల్లి గ్రామానికి చెందిన రమణయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సింహపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాధ(29)ను నమాత్‌పల్లి గ్రామానికి చెందిన పడిగెల వెంకటేశ్ ప్రేమించి రెండో పెళ్లిచేసుకున్నాడు. కాగా రాధ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో రాధ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. తమ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

# 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి చెందిన మీనాక్షి బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మీనాక్షిని మల్కాపురం నుంచి చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ వినయ్‌కుమార్, పైలెట్ చిన్నస్వామి ప్రసవం చేశారు. మీనాక్షి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యంకోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కోదాడ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కాపుగల్లుశివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్పీ కాల్వలో కంపచెట్లకు మృతదేహం అడ్డుపడిఉండి, కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహంపై తెల్లని చొక్కా, నల్లని లోయర్ ఉంది. గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# బొడ్రాయి పండుగకు వెళ్లి వస్తూ..

గుర్రంపోడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బొడ్రాయి పండుగకు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గుర్రంపోడు మండలంలోని తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం... అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందిన గణపతి వెంకన్న(42) గుర్రంపోడు మండలంలోని మక్కపల్లి గ్రామంలో గురువారం జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బైక్‌పై తిరిగి గ్రామానికి వస్తుండగా తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గేదె రోడ్డుకు అడ్డంగా రావడంతో ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

# అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



భువనగిరిలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అర్జునయ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అపరిచితులతో మహిళలు జాగ్రత్తగా ఉండాలని యాదాద్రిభువనగిరి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ అర్జునయ్య అన్నారు. పలుఅంశాలపై భువనగిరి బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణాలు, బస్టాండ్, మార్కెట్ తదితర బహిరంగ ప్రదేశాలలో గుర్తుతెలియని స్త్రీ, పురుషులు ఎవరైనా మాట్లాడించే ప్రయత్నాలకు, ఆహార పదార్థాలు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ఒంటరిగా మహిళలు అధిక మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు, తీసుకు వెళ్లవద్దని సూచించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు వస్తే తలుపు తీయవద్దని, ఫేక్ ఫోన్ కాల్స్ ఎత్తవద్దని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అండాలు, కృష్ణ, ఏఎస్ఐ రాములు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుల్స్ తురుపతమ్మ, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్, ఆగస్టు 14:(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బోయినపల్లి గ్రామ వాగులో అనుమతి లేకుండా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను(జేసీబీ), ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న మరో ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సదరు వాహన డ్రైవర్లతోపాటు యజమానులపై కేసు నమోదు చేశారు. కనగల్ వాగుబ్రిడ్జి, బోయినపల్లి వాగుబ్రిడ్జి వద్ద ఇరు వైపులా 500ల మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేదం ఉందని తెలిపారు. ఇసుక రీచ్‌ల్లో అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఇసుకను ఎత్తుకోవాలని సాండ్‌టాక్సీ వాహనదారులకు సూచించారు. బ్రిడ్జికి సమీపంలో ఇసుక తవ్వకాల కారణంగా అవి కూలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.


# జెండా పండుగకు ముస్తాబు




విద్యుత్ దీపాలతో ముస్తాబైన నల్లగొండ మునిసిపల్ కార్యాలయం




నల్లగొండలో సిద్ధమవుతున్న శకటం



నల్లగొండలో ముస్తాబైన అంబేడ్కర్ సర్కిల్




సూర్యాపేట కలెక్టరేట్‌లో సిద్ధమవుతున్న వేదిక

స్వాతంత్ర్య దినోత్సవానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. కలెక్టరేట్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్ ప్రాంగణాల్లో ఉదయం 8.30గంటలకు అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



నల్లగొండలో...



నల్లగొండలో విద్యుదీపాలతో సుభాష్‌చంద్రబోస్ సెంటర్



నల్లగొండలో పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు



భువనగిరిలో సిద్ధమవుతున్న వేదిక



భువనగిరిలో అతిథుల కోసం సిద్ధమైన కుర్చీలు

# 'పేట' చోరీ ఘటనలో అరకిలో బంగారం స్వాధీనం?

● సూర్యాపేట నగల దుకాణం చోరీ కేసులో పురోగతి ● పక్కా సమాచారంతో కోల్‌కతాకు పోలీసులు ● ముఠా సభ్యుల్లో ఒకరి అరెస్టు



బంగారు ఆభరణాల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ(ఫైల్)

సూర్యాపేట క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్డులో గల శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో సూర్యాపేట జిల్లా పోలీసులు అర కిలో బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గత నెల 20వ తేదీ అర్ధరాత్రి నేపాల్, జార్ఖండ్‌కు చెందిన వ్యక్తులు నగల దుకాణంలో చోరీకి పాల్పడి సుమారు మూడు కిలోల బంగారు ఆభరణాలు, సుమారు రూ.20లక్షల నగదును అపహరించారు. దుకాణ యజమాని తెడ్ల కిశోర్ ఫిర్యాదుతో పట్టణ పోలీసులకు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఖమ్మం జిల్లాకేంద్రంలో నివాసంఉంటే ఓ మహిళకు చోరీ ఘటనకు సంబంధించి ముందస్తు సమాచారం ఉండడం, చోరీకి పాల్పడిన నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడితో కొన్నినెలలుగా పరిచయం ఉందని గుర్తించిన సూర్యాపేట పోలీసులు ఇటీవల ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీకి పాల్పడిన నిందితుడు సూర్యాపేట నుంచి పారిపోయే క్రమంలో ఖమ్మంలో ఉంటున్న ఆ మహిళకు ఆభరణాలు ఇచ్చి వెళ్లటంతో సుమారు 14తులాల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

### మహిళ ఇచ్చిన సమాచారంతో..

సదరు మహిళ ఇచ్చిన సమాచారంతో పది రోజుల క్రితం కోల్‌కతా వెళ్లిన సూర్యాపేట జిల్లా పోలీసులు ముఠా సభ్యుల్లో ఒకడిని అదుపులోకి తీసుకుని సుమారు అర కిలో బంగారు అభరణాలతో పాటు కొంత మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మిగిలిన నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

# గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని నల్లగొండ-1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న 10మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కే. శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు నల్లగొండ-1టౌన్ పరిధిలో రెండు చోట్ల గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో, నల్లగొండ-1టౌన్ ఎస్ఐ జె.గోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి మునుగోడు మునుగోడు రోడ్డులో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. అదేవిధంగా నల్లగొండ-1టౌన్ ఎస్ఐ సతీష్‌తో తన సిబ్బందితో కలిసి మిర్యాలగూడ రోడ్డులో గల జూబ్లీ హిల్స్ కాలనీ సమీపంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 30వేలు విలువ చేసే 1.65 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని సేవిస్తున్న ఆరుగురు యువకులను రిహాబిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గంజాయి సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# భగవాన్‌సింగ్ ఆశయాలు సాధించాలి




విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటి స్పీకర్ రాంచందర్‌నాయక్

సూర్యాపేటరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజనుడు లోనవత్ భగవాన్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచందర్‌నాయక్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని రాజనాయక్‌తండాలో గిరిజనుల నాయకులు దివంగత భగవాన్‌సింగ్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలను గౌరవించేవారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కరించేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వూర రాంమూర్తి యాదవ్, పెద్దిరెడ్డి రాజా, డాక్టర్లు సునీల్., గిరిదర్, రాజానాయక్, శాంతాబాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# తాటిచెట్టు పైనుంచిపడి గీతకార్మికుడు మృతి



శ్రీను(ఫైల్)

శాలిగౌరారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారింగుల శ్రీను(45) రోజు మాదిరిగానే కల్లు గీయడానికి గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కాడు. కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. శ్రీనుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

# దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ

నల్లగొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నల్లగొండ కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు దొంగ ఓట్లపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఎన్జీ కళాశాల వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. ఒక్క అడ్రస్ తో వందలాదిమందికి ఓటు హక్కు కల్పించి ఓటు వేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లన్నీ బిజెపి నాయకులే నమోదు చేయించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, గాజుల సుకన్య, భాగ్య, సురెడ్డి సరస్వతి , ఎగ్గడి సుజాత, షేక్ జాను, జక్కలి లలిత, బొడ్డుపల్లి జానకి, సదాలక్ష్మీ, మీరా ఉన్నారు.

# మువ్వన్నెల పతాక రెపరెపలు




దేశభక్తి పెంపొందించేలా.. సమైక్యత భావం ఉప్పొంగేలా.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వందడుగుల (30 మీటర్లు) జాతీయ జెండా ఏర్పాటు చే శారు పాలకులు. నేను-నా మిర్యాలగూడ నినా దంతో, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొర వతో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండా ను 2024లో నిర్వహించిన 78వ స్వాతం త్ర్య దినోత్సవంలో ఆవిష్కరించారు. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలు, మహిళల కోలాట ప్రదర్శనలతో త్రివ ర్ణ దుస్తులు ధ రిం చిన ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏర్పాటైన జెండా నేటికి 365 రోజులు పూర్తయింది.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

వందడుగుల జాతీయ జెండా పర్యాటక ప్రాంతంగా మారింది. రాత్రి వేళల్లో కనిపించేందుకు విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశారు. అల్లంత దూరం నుంచి ఎత్తున కనిపిస్తున్న జెండాను దగ్గర నుంచి చేసేందుకు జనం వస్తున్నారు. జెండాను ఫొటో, వీ డియో తీయడంతో పాటు అక్కడ పోటీ పడి సెల్ఫీలు దిగుతున్నారు. అత్యున్నత స్థాయి ఇంజనీరింగ్, నాణ్య తా ప్రమాణాలతో బేస్మెంట్ నిర్మించి, ఉక్కుతో ఏర్పాటు చేశారు.

**జాతీయ భావం పెంపొందించేందుకే..**



ప్రజల్లో జాతీయ భావం పెంపొందిం చేందుకే నూరడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశాం. నియోజక వర్గ కేంద్రానికి వచ్చిన మంత్రులు, ఉన్న తాధికారులు, అతిథులు జెండాను చూసి మెచ్చుకుంటున్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా.

- బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, మిర్యాలగూడ.

## పెన్సిల్ మొనపై జాతీయ జెండా



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పుర స్కరించుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెం దిన సూక్ష్మ కళాకారుడు తమ లపాకుల సైదులు పెన్సిల్ మొనపైచెక్కిన జాతీయ జెండా ఆకట్టుకుంటోంది. ప్రిన్సిల్ మొనపై 9మిల్లీమీటర్ల ఎత్తుగల జాతీయ జెండా ను 15 నిమిషాల్లో చెక్కారు. గతంలో కూడా ఆవగింజపై, బియ్యపు గింజపై, అగ్గి పుల్లపై జాతీయ జెండాను, సూది రంధ్రంలో పట్టే జాతీయ జెండాను రూపొందించినట్లు సైదులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, కోదాడ.

## వెండితో ఇండియా గేట్



భువనగిరి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి వెండితో ఇండియా గేట్ సృష్టించారు. రూ.19వేల విలువైన 16తులాల వెండితో నెలరోజులు శ్రమించి 3.5 ఇంచుల ఎత్తు, 3 ఇంచుల వెడల్పుతో ఇండియా గేట్ రూపొందించారు. అతని ప్రతిభను పలువురు అభినందిస్తున్నారు. కాగా ఇతను గతంలోనూ బంగారం, వెండితో పలు కళాఖండాలు రూపొందించాడు.

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరి గుట్ట, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంక ర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణోత్సవం, సుదర్శన నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజ లు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,13,583 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు. దేవస్థానంలో కొండకింద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేసుకునేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. రోజుకు నాలుగు విడతలు జరిగే వ్రతాలు 10 గంటలకు జరిగే రెండో విడత ఉచిత వ్రతాలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు 210 మంది భక్తులు బుధవారం సాయంత్రం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరందరికి ఉచిత పూజ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు నిత్యం అందించే ఉచిత ప్రసాద వితరణకు హైదరాబాద్ చెందిన పుస్తె సత్యానారాయణ, సరళాదేవి దంపతులు గురువారం రూ.5లక్షల చెక్కును విరాళంగా ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మకు అందజేశారు.

**నేడు గుట్టకు మంత్రి రాక**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం కొండపైన దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా 'యాదగిరి ఆధ్యాత్మిక మాస పత్రిక' ను ఆవిష్కరించి ఈ-ఆఫీస్‌ను ప్రారంభిస్తారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారు. కాగా, శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని శనివారం (రేపు) మల్లాపురం దేవస్థాన గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్టాపనకు ఈవో ఎస్. వెంకట్రావు ప్రకటించారు.

**కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం**

మఠంపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో గురువారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు కమణీయంగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సంత్ కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశ్ మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన జాతీయ సంతు కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశం అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. చేనేత రంగానికి విశిష్ట సేవలందించిన జెల్ల వెంకటేశ్ రాష్ట్ర, జాతీయ అవార్డులు అందుకున్నారు. 10 సంవత్సరాల పాటు కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కొయ్యలగూడెం చేనేత వస్త్రాలకు జాతీయ అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో వెంకటేశ్ పాత్ర గొప్పది. అనేక ముఖ్య పట్టణాల్లో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించారు. వెంకటేశ్ అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. వెంకటేశ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

# ప్రాజెక్టులకు జలకళ

**నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రధాన ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ జలాశయానికి స్వల్పంగా నీటిరాక తగ్గినా 26క్రస్టు గేట్లనుంచి నీటిని విడుదల చేస్తున్నారు. డిండి ప్రాజెక్టు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది. మూసీకి వరద కొనసాగుతోంది.**

నాగార్జునసాగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువనుంచి 2,28,141 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా గురువారం సాయంత్రం 6 గంటలకు 1,72,774 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.50 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి మొత్తం 2,37,056 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

**డ్యామ్‌కు త్రివర్ణ శోభ**

79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ క్రస్ట్ గేట్లపై మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో సాగర్ డ్యామ్ త్రివర్ణ సాగరంగా మారింది. ఈ సుందర మనోహర దృశ్యం పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తోంది.

**మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి**

కేతేపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గత వారం రోజులకు పైగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నదికి చేరిన వరద దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టు గత వారం రోజులుగా వరద నీటితో పొంగి పొర్లుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇన్‌ఫ్లో 13254.45క్యూసెక్కులుగా నమోదయ్యింది. వరద ఉధృతి గురువారం ఉదయం వరకూ కొనసాగింది. హైదరాబాద్ నగరంతో పాటు యాదాద్రి జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు 643.05అడుగుల గరిష్ట స్థాయిలో ఉన్న ప్రాజెక్టు నీటిమట్టాన్ని భారీగా తగ్గించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రాజెక్టు 2, 3, 4, 5, 6, 7, 8, 10నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 10098క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీ రిజర్వాయర్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 6612.55క్యూసెక్కులుగా నమోదయ్యింది. ఇదిలా ఉంటే 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.55అడుగులు (3.84టీఎంసీలు)గా ఉంది.



సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లనుంచి కిందకి వెళ్తున్న వరద

**ఉధృతంగా దుందుభి వాగు**



అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

డిండి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి వల్ల గతవారం రోజులుగా ఎగువన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో కురుస్తున్న భారీ వర్షాలకు డిండి ప్రాజెక్టు నీటిమట్టం 36 అడుగుల గరిష్టస్థాయికి చేరింది. దుందుభివాగుకు వరద ప్రవాహం పెరగడంతో గురువారం ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అయింది. ఎగువ నుంచి 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ తెలిపారు. ఈ వానాకాలం ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలోని 12,500 ఎకరాలకు, కుడికాల్వ పరిధిలోని 300 ఎకరాలు సాగులోకి రానుంది. ఇప్పటికే గతనెల 30న డిండి ప్రాజెక్టు నీటిని వానకాలం సాగుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విడుదల చేశారు. స్పిల్‌వే వియర్ నుం చి దిగువకు నీరు విడుదలవుతోంది. డిండి వాగుద్వారా దిగువకు విడుదలైన నీరు బక్కలింగాయపల్లి వద్ద నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో కలుస్తుంది.

**రెవెన్యూ, పోలీస్ అధికారుల హెచ్చరిక**

డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టు దిగువన చేపలవేటకు పశువులు, గొర్రెలు మేపేందుకు వెళ్లకూడదని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. స్పిల్‌వే వియర్ వద్ద సెల్ఫీల కోసం నీటిలోకి దిగరాదని వారు హెచ్చరించారు.

**జీ.వెల్లెంల రిజర్వాయర్ గేట్లు మూసివేత**

నార్కట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా బీ.వెల్లెంల రిజర్వాయర్ నుండి కుడి, ఎడమ కాలువలకు వదులుతున్న నీటి విడుదలను బుధవారం సాయంత్రం నుండి నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ నవీన్ కుమార్ తెలిపారు. వాతావరణం సాధారణ స్థితికి చేరిన తర్వాత ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు గేట్లను తెరుస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

# పదవీ కాలం మరో ఆరు నెలలు

- ప్రభుత్వం ఉత్తర్వులు ● సొసైటీలకు సమకూరనున్న నిధులు

నల్లగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్), డీసీసీబీ పాలకవర్గం గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారంతో పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సహకార ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనందున, సొసైటీల అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు పరిధిలో 108 సొసైటీలు ఉన్నాయి. దీంతో పాటు బ్రాంచ్‌లను కూడా విస్తరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.2750కోట్లకు పైగా ఉండగా రూ.3వేల కోట్ల టర్నోవర్ కోసం ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13తో పీఏసీఎస్‌తో పాటు డీసీసీబీ పాలకవర్గం ముగియడంతో ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగిస్తూ అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి పదవీ కాలం ముగుస్తున్న క్రమంలో మరో ఆరు నెలల పాటు పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం బాధ్యతలు నిర్వహించనున్నాయి. సొసైటీలకు, డీసీసీబీకి స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే పాలన మందగించి అభివృద్ధి కుంటుపడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకార రంగంపై దృష్టి సారించి జీవో నెంబర్ 74ను జారీ చేసింది. సహకార వ్యవస్థ నిబంధనలు, 1964 యాక్ట్ ప్రకారం గడువు పొడిగించినప్పుడల్లా పదవీకాలం ఆరు నెలల వరకు పెరుగుతుంది. ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల అనంతరమే పీఏసీఎస్‌ల ఎన్నిక నిర్వహించి డీసీసీబీ పాలకవర్గాన్ని కూడా ఎన్నుకునేందుకు చర్యలు తీసుకోనుంది. పాలకవర్గాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలకు, డీసీసీబీకి పెద్ద మొత్తంలో నిధులు సమకూరనున్నాయి. అదేవిధంగా డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాస్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైనందున జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అత్యధికంగా నిధులు రప్పించేందుకు అవకాశం ఏర్పడింది. అదేవిధంగా రైతులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలతో పాటు విద్యా రుణాలు, గోల్డ్ లోన్‌లు, ఇంకా ఇతర రుణాలు భారీగా మంజూరు చేసేందుకు కూడా అవకాశం ఏర్పడింది.

**సొసైటీలను మరింత బలోపేతం చేస్తాం: డీసీసీబీ చైర్మన్**

పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం కలిగింది. ఆరు నెలల పాటు పదవీకాలం పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు. నాస్కాబ్ డైరెక్టర్, డీసీసీబీ చైర్మన్‌గా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పీఏసీఎస్‌లను, డీసీసీబీని బ్రాంచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం సంతోషకరం. రైతుల కోసం రైతులతో 107 సంవత్సరాల క్రితం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఈ సంవత్సరం పైగా కాలంలోనే రూ.3వేల కోట్ల టర్నోవర్ వరకు తీసుకుపోవడానికి డీసీసీబీ పాలకవర్గ సభ్యులతో పాటు పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఎంతగానో సహకరించారు.. రాబోయే రోజుల్లో బ్యాంకు మరింత అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తాం.

## జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణి



సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణిని నియమించారు. ఈ మేరకు కృష్ణవేణి పేరున తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో అనుబంధ సంఘాలతో పాటు పలు జిల్లాల అధ్యక్షులను కవిత ప్రకటించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్‌కు చెందిన సూరారపు కృష్ణవేణిని జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షు రాలిగా అవకాశం ఇచ్చిన కవితకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను, సమర్థంగా నిర్వహిస్తానని, జిల్లాలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు.

## వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 ( ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో అండర్- 15 బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపిక పోటీలు జరిగాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ఎంపిక పోటీలకు వివిధ పాఠశాలల నుంచి బాల, బాలికలు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన బాల, బాలికలను హైదరాబాద్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-15 బాలబాలికల పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, పీఈటీలు, బాలబాలికలు పాల్గొన్నారు. 14ఎంఆర్‌జీడి03: దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## అపజయాలు.. విజయానికి సోపానాలు



బెల్లి జనార్దన్ దంపతులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు

మర్రిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అపజయాలను విజయానికి సోపాలుగా విద్యార్థులు మలుచుకోవాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్, నటుడు, నిర్మాత బెల్లి జనార్దన్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ శిక్షణ ఇచ్చారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే యువత విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మెలగాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే కలిగే నష్టాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్స్ బ్యాగ్స్‌లను పంపిణీ చేశారుఅనంతరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బెల్లి జనార్దన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, ఉదావత్ లచ్చీరాం, ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్, సభావత్ వెంకట్‌కుమార్‌మీనా, ధనలక్ష్మి, స్వరూప రాణి, ఫరంగి, సికిందర్, గిరి వెంకటయ్య, శ్రీనివాస్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 17న ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17వ తేదీన పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సంస్థ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9398081178ను సంప్రదించాలని కోరారు.

## క్రీడా పాఠశాలకు 14 మంది ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 ( ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకీ, అథ్లెటిక్స్ హ్యాండ్‌బ్యాల్, ఫుట్‌బాల్ క్రీడా అకాడమిలో 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో జూలై 15, 16 తేదీల్లో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా కు చెందిన తొమ్మిది మంది బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారని డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో నల్లగొండకు చెందిన భావన ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

# నేటి నుంచి వార్షిక టోల్ పాస్ విధానం

- రూ.3వేలతో ఏడాదికి ఒకసారి రీచార్జీతో 200 ట్రిప్పులు



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

కేతేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) విధానం 65వ నెంబర్ జాతీయ రహదారిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మూడు టోల్‌ప్లాజాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. ఏడాదికి ఒకసారి రూ.3వేలతో వార్షిక ఫాస్టాగ్‌ను రీచార్జీ చేయించే నాలుగు చక్రాల సొంత వాహనదారులకు(తెలుపు రంగు ప్లేట్) టోల్ భారం తగ్గనుంది. నాలుగు చక్రాల ట్యాక్సీ వాహనాలకు (పసుపు రంగు ప్లేట్) ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) వర్తించదు. ఈ వార్షిక టోల్‌పాస్ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలలో మాత్రమే పనిచేస్తుంది. ఈ పాస్‌తో ఒక్కో వాహనం జాతీయ రహదారులపై 200ట్రిప్పులు తిరిగే వెసులుబాటు ఉంది. ఒక టోల్‌ప్లాజా నుంచి ఒక వైపు ప్రయాణానికి ప్రస్తుతం నాలుగు చక్రాల వాహనదారుడు రూ.50 నుంచి రూ.130 వరకు చెల్లించాల్సి వస్తుండగా వార్షిక టోల్‌పాస్‌తో కేవలం రూ.15కే ఒక టోల్‌ప్లాజాను దాటే వీలు కలుగుతుంది. ప్రస్తుతం 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికిల్ వాహనదారులు ఒక ట్రిప్పుకు ఈ రహదారిపై గల యాదాద్రిభువనగిరి జిల్లా పతంగి టోల్‌ప్లాజాలో రూ.80, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో రూ.130, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు టోల్‌ప్లాజాలో రూ.105 మొత్తంగా రూ.305 చెల్లిస్తున్నారు. ఇరువైపులా ప్రయాణానికి రూ.610 చెల్లించాల్సి ఉంటుంది. ఈ వార్షిక టోల్‌పాస్‌తో ఈ రహదారిలోని మూడు టోల్ ప్లాజాలను దాటడానికి కేవలం రూ.45 మాత్రమే భరించాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంతో కలిపితే ఒక వాహనం రూ.90తో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి రావచ్చు. అయితే ఈ వార్షిక పాస్ వాహనదారులంతా తీసుకోవడం తప్పనిసరేమీ కాదు. వాహనదారుల రోజువారీ టోల్‌చార్జీలను తగ్గించడమే లక్ష్యంగా అమలుచేస్తున్న ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్)ను ఇష్టపడని వారు ప్రస్తుతం వాడుతున్న సాధారణ ఫాస్టాగ్‌తో యథాత థంగా ప్రయాణించే వెసులుబాటు వాహనదారులకు కల్పించారు. హైదరాబాద్ - విజయవాడల రహదారిపై ఇరువైపులా సాధారణ రోజుల్లో 9వేల నుంచి 12వేల వాహనాలు ప్రయాణిస్తుండగా వారాంతపు రోజుల్లో దాదాపు 15 వేల వరకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండగ రోజుల్లో ఈ సంఖ్య 20 వేల వరకు ఉంటుంది.

**వార్షిక ఫాస్టాగ్ ఎలా తీసుకోవాలి?**

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక ఫాస్టాగ్ కోసం వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి వాహన రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో రూ.3వేలు చెల్లిస్తే ప్రస్తుత ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది. వాహనదారుడు ప్రస్తుతం వినియోగిస్తున్న ఫాస్టాగ్ బ్లాక్‌లిస్టులో లేకుండా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాలి.

**వార్షిక టోల్‌పాస్ అమలుకు ఏర్పాట్లు చేశాం**

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న వార్షిక టోల్‌పాస్(ఫాస్టాగ్) అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. వార్షిక టోల్‌పాస్ కలిగిన వాహనాల కొరకు టోల్‌ప్లాజాలో ప్రస్తుతానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏమీ లేవు. భవిష్యత్తులో ఎన్‌హెచ్ఏఐ ఆదేశిస్తే ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. వార్షిక ఫాస్టాగ్ కలిగిన వాహనాలు టోల్‌ప్లాజాలోని ఏ కౌంటర్ నుంచైనా వెళ్లవచ్చు.

-ఇమ్రాన్, మేనేజర్, కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

## వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తిరుమలగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం మేలుకొలుపు అశ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ అన్నారు. గురువారం తిరుమలగిరిలో వడ్డెర సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకారం ఎమ్మెల్యే టికెట్‌తో పాటు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పల్లపు సతీష్, గొలుసుల మహేష్, సైదులు, రామచంద్రు, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.



## ఎస్ఐగా మోహన్‌బాబు బాధ్యతల స్వీకరణ



హుజూర్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ ఎస్ఐగా బండి మోహన్‌బాబుయాదవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మిర్యాలగూడలో పనిచేసిన ఆయన అక్కడ నుంచి నల్లగొండ వీఆర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఎస్‌గా హుజూర్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా భారీ బందోబస్త్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

## సకాలంలో చికిత్స అందించిన 108 సిబ్బంది

తిరుమలగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కుక్క కరిచిన వ్యక్తికి 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో చికిత్స అందించారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని తిరుమలహిల్స్‌లో నివసిస్తున్న ప్రభుత్వ టీచర్ కంచుకట్ల రాములు పని నిమిత్తం బయటికి వెళ్లగా పిచ్చికుక్క వెంటపడి తీవ్రంగా గాయపర్చింది. చుట్టుపక్కల వాళ్లు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ క్రాంతికుమార్, పైలెట్ శంకర్‌లు వెంటనే స్పందించారు. టీచర్ రాములుకు ప్రథమ చికిత్స అందించి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వైద్యం అందించిన 108అంబులెన్సు సిబ్బందిని స్థానికులు అభినందించారు.



# ముంపు గ్రామాల ప్రజలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, కోదాడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు గ్రామాల ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్లు మునిగి నిరాశ్రయులను ప్రజలను గురువారం ఆమె పరామర్శించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. వరద బయటికి వెళ్లేం దుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ముంపునకు గురైన తమ్మర, లక్ష్మీపురంతో పాటు సుందరయ్యకాలనీ, అల్వాలపురం తదితర గ్రామాలను పరిశీలించారు. నిరాశ్రయిలైన ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి నిత్యావసర సరుకులు అందించాలని ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలోని అంతర్ గంగ వాగు, పాలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఈ వాగులు దాటేందుకు ప్రజలు, వాహనదారులు ఎలాంటి సాహసాలు చేయొద్దని సూచించారు. చెరువు కట్టలు తెగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెడ్ల కుంట చెరువుకట్ట తెగేందుకు సిద్ధమైందని ఆ గ్రామస్థులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు చెరువు వద్దకు చేరుకుని గండ్లు పడిన చోట వెంటనే పూడ్చివేశారు. కూచిపూడి వద్ద అంతర్ గంగ వాగు ఉధృతంగా ప్రవహించడంతో దొండపాడు, కూచిపూడి మధ్య రాకపోకలు నిలిచాయ.. భారీ వర్షాలతో వందలాది ఎకరాల్లో వరిపంట నీటమునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దోరకుంట, తొగర్రాయి, కాపుగల్లు, కూచిపూడి, గణపవరం గ్రామాల్లో నాట్లు వేసిన 500 ఎకరాలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు తగిన నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించి పంటనష్టంపై అంచనా వేసి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే పద్మావతి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.



కోదాడలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

### అప్రమతంగా ఉండాలి

ముంపు ప్రాంతాల వారు అప్రమతంగా ఉండాలని ఎమ్మెల్యే పద్మావతిఅన్నారు.మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి కోదాడ ప్రాంతం జలమయమైంది. పలు ముంపు ప్రాంతాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మరో రెండు రోజులు పాటు వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ జారీ చేసిన హెచ్చరిక నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉన్నారు.

## సమస్యలు ఉంటే తెలియజేయాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరదతో సమస్యలు ఉంటే ప్రజలు వెంటనే తెలియజేయాలని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. దద్దనాల చెరువు కాలనీలోకి నీరు రాకుండా ఎక్స్‌కవేటర్ సాయంతో ఆయన పనులు చేయించారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఒకటో వార్డులోని పలు కాలనీలను పరిశీలించారు. రోడ్లకు గండ్లు పెట్టి వరదను తొలగించారు. గురువారం పట్టణంలోని గోవిందాపురం, దద్దనాల చెరువు కాలనీ, మఠంపల్లి బైపాస్, కోదాడ రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దద్దనాలచెరువు, ఎన్జీవో కాలనీ, గోవిందాపురం, అంబేద్కర్ కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోవిందాపురంలోని శ్మశాన వాటికకు వెళ్లే కుంగిందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మెరిగె అశోక్, పాలడుగు ధనుంజయ్, బండి భాస్కర్, జ్ఞానయ్య, లక్ష్మీనర్సు, గొట్టెముక్కల రాములు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తిరుమలగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. బుధవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అబివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మరో ప్రాంత్రానికి తరలిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావొచ్చాయన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది అన్న బీఆర్ఎస్ నాయకులకు ప్రకృతే సమాధానం ఇచ్చిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మీలాల్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, లక్ష్మయ్య, అంబేడ్కర్, నర్సింహారెడ్డి, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా దుస్తులు అందజేయడం అభినందనీయం

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేయడం అభినందనీయమని అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాసు అన్నారు. బుధవారం మండలంలోని కందగట్ల గ్రామంలో వంగేటి చెన్నారెడ్డి జ్ఞాపకార్థం మనుమడు వంగేటి కేశవరెడ్డి రూ.10వేల విలులైన క్రీడా దుస్తులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాడపల్లి మురళీకృష్ణ, దాత వంగేటి కేశవరెడ్డి పాల్గొన్నారు.

## కోదాడ అభివృద్ధి ప్రదాత చిన్న అప్పయ్య

కోదాడ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోదాడ అభివృద్ధి ప్రదాత గుడుగుంట్ల చిన్న అప్పయ్య అని బీజేపీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కోదాడ మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు, కోదాడ తొలి సర్పంచ్ గునుగుంట్ల చిన్న అప్పయ్య విగ్రహాన్ని, మాజీ మంత్రి అక్కిరాజు వాసుదేవరావు విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనగాల నారాయణగోదేశీ లక్ష్మణ్, వనం నాగేశ్వరరావు, పైడిమర్రి సతీష్ ఓరుగంటి పురుషోత్తం పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థికసాయం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన మానస బీటెక్ చదవడానికి సూర్యాపేటకు చెందిన వ్యాపారి చల్లా లక్ష్మీ ప్రసాద్ రూ.5వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మట్టిపల్లి సైదులు, బొమ్మిడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## యూరియా సరఫరా చేయడంలో విఫలం

నేరేడుచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయానికి సరిపడా యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆరోపించారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయానికి కావాల్సిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఊదర వెంకన్న, వెంకట్, భరత్ పాల్గొన్నారు.

## ప్రజలంతా కాంగ్రెస్ వెంటే

సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా కాంగ్రెస్ వెంటే ఉన్నారని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు వారిని సన్మానించే కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో సెప్టెంబరు ఒకటో తేదీన చేపేట్ట మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.రవికుమార్, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో మహాధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్యాం, పాండు నాయక్, లక్కపాక ప్రవీణ్‌కుమార్, షేక్ బషీర్ పాల్గొన్నారు.

## కట్ట తెగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బట్టవానికుంట చెరువు కట్ట తెగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పులిచింతల అంజిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేపలసింగారం రోడ్డులో ఉన్న బట్టవానికుంట చెరువు ఆక్రమణకు గురైందన్నారు.. గతంలో చెరువుకు రెండు అలుగులు, రెండు తూములు ఉన్నాయన్నారు. ఒక అలుగు, రెండు తూములను మూసివేశారన్నార ఫలితంగా గత ఏడాది భారీ వర్షాలకు చెరువుకట్ట తెగి రూ.50 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. రూ.10 లక్షలతో చెరువుకట్టకు మరమ్మతులు చేశారన్నారు. ప్రస్తుత భారీ వర్షాలతో చెరువు కట్ట తెగే ప్రమాదం ఏర్పడిందన్నారు.



## కాంగ్రెస్ పార్టీ నాయకుడి మృతి

నూతనకల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లసింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కట్ట సత్తిరెడ్డి(70)గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుమారుడిని కాంగ్రెస్ నాయకుడు కట్ట మల్లారెడ్డిని ఓదార్చారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

హుజూర్‌నగర్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర సాయిలో అర్హులకు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమణిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చింతల నిర్మలారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ఉత్తమ్ నివాసంలో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమావేశంలో అనురాధ, దేవరం అనితప్రభాకర్‌రెడ్డి, సావిత్రి, రజిత పాల్గొన్నారు.

## అనంతగిరిలో ఘనంగా తిరంగా యాత్ర

. అనంతగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన త్యాగ ధనులను స్మరించుకోవడం అందరి బాధ్యతని బీజేపీ అనంతగిరి మండల అతఃధ్యక్షుడు చింతకుంట్ల సతీష్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం అనంతగిరి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర చేపట్టారు. మహానీయులు అంబేద్కర్, సుభాష్‌చంద్రబోస్ విగ్రహాలకు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మువ్వెన్నల పతాకాలతో భారత్ మాతాకి జై అంటూ నినాదాలతో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌బాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎద్దయ్య, యాకూబ్, వికాస్‌రెడ్డి, పురుషోత్తం, రాధాకృష్ణ, రవి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మఠంపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటిపై శుక్రవారం జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీమండల అధ్యక్షుడు వెంకటశివ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రిపురం శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి నరసింహారెడ్డి, వీరారెడ్డి, అమరయ్య, స్వామినాయక్, మురళీధర్, కాంతరావు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ ఎన్నికల తీర్పు వైసీపీకి కనువిప్పు కావాలి

కోదాడ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి కనువిప్పు కావాలని డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్తవరపు పాండురంగారావు అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ వ్యవహారంలో రాహుల్‌గాంధీ మాట్లాడటంలేదని జగన్మోహన్‌రెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కోదాడ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కోదాడలో ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలు అలుగుపోయడతో పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు.

# వర్షంతో అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

రావిపహడ్, నామవరం, సిరికొండ గ్రామాల పెద్ద చెరువులు అలుగులు పోస్తున్నాయి. కూడలి చెక్‌డ్యాం వద్ద వరద బ్రిడ్జికి తాకుతూ వెళ్తోంది. అన్నారిగూడెం గ్రామానికి పాలేరు రిజర్వాయర్ జలాలు తాకాయి.

●చింతలపాలెం: భారీ వర్షాలకు పత్తి, మిర్చి పైర్లు నీట మునిగిపోగా, పొలాల్లో మేట వేసింది. ఎర్రవాగు సమీపంలో లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో భోపాల్‌రెడ్డి, దొండపాడు కార్యదర్శి సైదులు పరిశీలించారు.

●అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం -వంగమర్తి మధ్య బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రైతులు మోటార్ల కోసం వెళ్లవద్దని తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ సైదులు సూచించారు. కోడూరు వాగు కింద గొలుసుకట్టు చెరువులు అలుగు పోస్తుండడంతో రాకపోకలు నిలిచాయి.

● మేళ్లచెర్వు: నాగులచెరువులో నీటి ప్రవాహానికి అడ్డుపడిన గుర్రపుడెక్కను స్థానిక నాయకులు తొలగించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కందిబండలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్కగా, మేళ్లచెర్వు, చింతలపాలెం మండల కేంద్రాల మధ్యలో ఉన్న రైల్వే అండర్ పాస్ నుంచి వాహనాలను నిలిపివేశారు. రామాపురంలోని గోపాలరావు చెరువు చెరువు నిండి కట్ట తెగే ప్రమాదం ఉండటంతో బుధవారం రాత్రి స్థానిక నాయకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

● పెన్‌పహాడ్: పొట్లపాడు రోడ్డు వద్ద నీటి ప్రవాహానికి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 25 ఎకరాల వరకు పొలాలు మునిగాయి. ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మాచారం -పొట్లపాడు తారురోడ్డు వర్షంతో ధ్వంసమై పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జడ్పీ సీఈవో

●నూతనకల్: గుండ్లసింగారం శివారు సూర్యాపేట-దంతాలపల్లి రహదారిలో పాలేరు వాగుపై ఉన్న శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని జడ్పీ సీఈవో అప్పారావు, డీఎల్‌పీవో నారాయణరెడ్డి పరిశీలించారు. వరద ఉధృతంగా ఉంటే ఆ దారిలో ప్రయాణం చేయరాదన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, ఏఈ కల్యాణ్, కార్యదర్శులు చలమయ్య, శర్మ తదితరులు వారితోపాటు ఉన్నారు.

● చింతలపాలెం: భారీ వర్షాలు, ఈదురు గాలులకు చెట్లు విరిగి పాఠశాల భవనంపై పడుతుండటంతో కస్తూర్బా బాలిక విద్యాలయం విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

## వృద్ధురాలి దహన సంస్కారాలకు ఆర్థికసాయం

కోదాడ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోదాడ మునిసిపాలిటీ పరిధిలోని 34వ వార్డులో నిరుపేద వృద్ధురాలు కొత్తపల్లి లక్ష్మమ్మ మృతి చెందింది. లక్ష్మమ్మ అంత్యక్రియలకు వార్డులోని సమభావన సంఘాల మహిళలు, ప్రజలు విరాళంగా రూ.8850లను వృద్ధురాలి భర్త కొత్తపల్లి ముత్తయ్యకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా రిసోర్స్ పర్సన్ చెరుకుపల్లి అఖిల, గంధం రాణి, సూరపల్లి సత్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

సూర్యాపేట రూరల్, నేరేడుచర్ల, చిలుకూరు, మునగాల రూరల్, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల; ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసరబాద గ్రామంలో ఊర ముత్యాలమ్మ బోనాల పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు మట్టి కుండలలో బోనం చేసుకుని పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి సామూహికంగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించారు.

●శ్రావణమాసం సందర్భంగా నేరేడుచర్ల మండలం గంటవారిగూడెం గ్రామంలో బోనంతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు సమర్పించారు. అనంతరం గ్రామ దేవతలకు మొక్కు కుని వన భోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు బండ్ల శ్రీనివాసు, రావుల సత్యం, ఆకుల జగతయ్య, రావుల రాజు, బొమ్మశెట్టి నాగరాజు, నర్సింగోజు మదనాచారి, రామకృష్ణ, పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

● చిలుకూరు మండల కేంద్రంలోని పాత చిలుకూరులో గురువారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలతో డప్పు వాయిద్యాలతో ముత్యాలమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● మునగాల మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గురువారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు షేక్ ఖాజాబీ సైదా, నలమాద మల్సూరు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారం, దూపాడు, అన్నారం బ్రిడ్జి గ్రామాల్లో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంతో పాటు బొడ్రాయి చుట్టూ ప్రభ బండ్లతో ప్రదక్షిణలు చేశారు. నాగులపాటి అన్నారం, అన్నారం బ్రిడ్జి గ్రామాల్లో సొంత ఖర్చులతో బోనాల పండుగ, కనకదుర్గమ్మ పండగ నిర్వహించిన దాత తండ ఎల్లయ్యను ఆయా గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిదులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్: మండల పరిదిలోని గట్టికల్, కందగట్ల, పాతర్లపహాడ్ గ్రామాలల్లో గురువారం ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. బ

● మద్దిరాల గ్రామంలో గురువారం ప్రజలు బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని బొడ్రాయి చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ముత్యాలమ్మకునైవేద్యం సమర్పించారు.

## ఒకటే బస్సు.. ఆలస్యమైతే ఇంటికే



తిరుమలగిరిలో 10గంటల తర్వాత కూడా బస్సు కోసం ఎదురుచూస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థినీవిద్యార్థులు

తిరుమలగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒకటే బస్సు కారణంగా తిరుమలగిరి మునిసిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నారు. కేటాయించిన ఒక్క బస్సు ప్రతిరోజు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి పాఠశాలకు చేరుకుంటున్నారు. కొంత మంది విద్యార్థులు పాఠశాల సమయం దాటిందని ఇళ్లకు వెళుతున్నారు. పాఠశాలకు వెళ్లడానికి బుధవారం మునిసిపల్ కేంద్రానికి చేరుకున్న చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు 10గంటలు దాటినా పాఠశాలకు తీసుకువెళ్లే బస్సురాలేదు. దీంతో కొంతమంది విద్యార్థులు ఆటోల్లో పాఠశాలకు వెళ్లగా, మరికొందరు ఇళ్లకు వెళ్లారు.